# గిఫ్ట్ బేబి

బిడ్డల స్వార్థం తగ్గాలంటే... తల్లులు కొంత స్వార్థాన్ని సంతరించుకోక తప్పదు.
- జయప్రద

"ఆ బిడ్డ మనింట్లో ఎందుకు?"

- కడుపులో కోపాన్ని కడుపులోనే దాచుకుని, మెత్తగానే అడిగింది సౌమ్య.

కోడలి సౌమ్యతకు ముగ్ధురాలు కాలేదు భారతి.

ఆ ఆశ ఆరిపోయి, చాలా కాలమైంది. 'అత్తమ్మ కూడా నా మనిషే... ఆమె నా భర్తకు తల్లి! నేను తననీ ప్రేమించాలి, ఆదరించాలి' అని తన కోడలు తెలుసుకుంటుందని చాలా కాలం ఎదురుచూసిందామె. ఆఖరుకు తన మనవణ్ణి తనకు దగ్గర కానీయకుండా చేస్తుంటే... ఎదురుతిరగక తప్పలేదామెకు.

దాని ఫలితమే... ఈ బిడ్డ!

"నాకూ కాలక్షేపం కావాలి కదమ్మా! అందుకని, ఈ బిడ్డను పెంచుకుంటున్నాను..." మెత్తగా, మర్మంగా విమర్శిస్తున్న అత్తను చూస్తే... ఒళ్ళుమండింది సౌమ్యకు.

"కాలక్షేపానికి ఇదేమైనా బొమ్మా?" నిగ్రహించుకోగా, మిగిలిన విసుగు అది!

"బొమ్మలతో ఆడుకునే వయస్సామ్మా నాది? కాకపోతే, నాకు చనిపోయే ధైర్యం లేదు. పైగా, బ్రతకాలని ఆశ వుంది. కానీ, 'తోడు లేకుండా ఎలా బ్రతకాలా...' అని బుఱ్ఱ బద్దలు కొట్టుకున్నాక- నాకు తోచిన సొల్యేషన్ ఇది. నాకూ తెలుసు. వాడూ రేప్పొద్దున పెద్దవాడవుతాడు. వాడికి తీర్చాల్సిన కోరికల్నీ, జరపాల్సిన ధర్మాల్నీ అన్నీ... అన్నీ... మీ ఆయనకు జరిపినట్టే జరపాలి. ఆ సంగతి తెలుసమ్మా నాకు!"

పిరికిదైన తన అత్తకు ఈ 'తెగువ' ఎలా వచ్చిందో మొదట బోధపడలేదు సౌమ్యకు. తర్వాత చూచాయగా గ్రహింపుకొచ్చింది.

దీన్ని ఇలా సాగనిస్తే- అమ్మో... ఇంకేమైనా ఉందా? ఈ ఆస్తినంతా మరలా రెండుగా విభజించాల్సి వస్తుందేమోనని మరో బిడ్డను కూడా తను వద్దనుకుంటే... ఇప్పుడు ఎవరికో పుట్టిన ఈ వెధవకు ఆస్తి పంచాల్సి వస్తుంది.

ఇప్పుడు తను తెలివిగా, లలితంగా వ్యవహరించాలి... తప్పదు. ఇన్నాళ్లుగా నిద్రపోయిన ఆమె తెలివితేటలు ఇప్పుడు లేచాయి. ఆమె అహాన్ని అణచివేశాయి.

"అదేంటి అత్తమ్మా! నానీ లేడూ మీకు... కాలక్షేపానికి?"

"భలేదానివే... వాడెందుకు లేడూ?! కాకపోతే, వీడు నాకు కొడుకు... వాడు నాకు మనవడు."

తన చిరాకును కప్పిపుచ్చలేకపోయింది సౌమ్య.

"మనువడైతే ఒకటీ, కొడుకైతే ఒకటీనా? అయినా... ఈ వయస్సులో మీకు కొడుకేవిటి?"

"నిజమే అమ్మా! ఈ వయస్సులో... నువ్వు చెప్పేదీ నిజమే! మీ ఆయన తర్వాత, ఇంకో బిడ్డను అప్పుడే కనుండాల్సింది. పోనీలే... ఇప్పుడైనా మించిపోయిందేముంది?"

సౌమ్య మాటల కొరకు వెదుక్కుంటోంది.

"సౌమ్యా! నీ రెండో ప్రశ్నకు నేనింకా జవాబు చెప్పలేదు. వయసైపోతోంది కదా... కొద్ది మతిమరుపు! 'మనవడైతే ఏమి? కొడుకైతే ఏమి?' అని కదూ అడిగావు నువ్వు? దానికి నేను జవాబు చెప్పాలి కదా!"

"అదికాదు అత్తమ్మా..."

"ఉండు... ఉండు... మరలా మర్చిపోతాను. మొదట నన్ను చెప్పనీ! కొడుకు మీద సర్వాధికారాలు తల్లివే కదమ్మా... నీకు 'నానీ' మీద ఉన్న హక్కులా! అందుకే నాకూ స్వంతంగా ఓ బిడ్డ కావాలన్పించింది" తల వంచుకుని చేటలో బియ్యం ఏరుతూనే అంది భారతి.

నిజానికి ఆమె చేటలో బియ్యం ఏరడం లేదు. ఆమె వేళ్లు కదుల్తున్నాయంతే! ఆమె మెదడు మాత్రం ఈ ఇంటిమనిషి అయిన తన పట్ల కోడలిలో ఉండకూడని 'పరాయి భావాన్ని' ఏరి చూపిస్తోంది.

సౌమ్యకు విపరీతంగా కోపమొస్తోంది. మనసు నిగ్రహాన్ని కోల్పోతోంది. ఆమె నాలుక మాత్రం జాగ్రత్త పడుతోంది-

"అత్తమ్మా... ఎప్పటికీ అలా అనుకోకండి! నానీ నాకెంతో... మీకూ అంతే! ఎవరో కన్నబిడ్డ మనకెందుకు? ఎవరికైనా తిరిగి ఇచ్చేద్దాం... నానీ మీ బిడ్డే అనుకోండి... వాడి మంచిచెడ్డలన్నీ ఇక మీవే!"

వేదన విడిచిన వేడి నిట్టూర్పును గుండెలోనే నిక్షిప్తం చేసుకుని, మనసులోనే అనుకుంది భారతి-

'ఈ ముక్క కాస్త తన మనసు విరగకముందే చెప్పివుంటే ఎంత బాగుండేది!'

ఆమె నిశ్శబ్దంగా లేచి, అక్కడినుండి కదిలి వెళ్లిపోయింది.

'ఈ ముసల్దానికెంత టెక్కు! జవాబేం చెప్పకుండా వెళ్తోంది!' అని విసుక్కున్న సౌమ్య ఆత్మపరిశీలన చేసుకోలేదు. చేసుకుంటే... నానీ పుట్టిన తర్వాత ఆ ఇంట్లో జరిగిన గొడవల్ని నెమరేసుకుంటే... జవాబు ఆమెకే దొరికుండేది.

ఆమె నెమరు వేసుకోకపోయినా... వంటింట్లో కెళ్లిన భారతిని మాత్రం ఆ జ్ఞాపకాలు వద్దన్నా వదలడం లేదు.

●

"బాబు ఎవరి పోలిక అత్తమ్మా?"

పొత్తిళ్ళలో బిడ్డ వంక చూస్తూ అడుగుతున్న కోడలి వైపు ప్రేమగా చూసింది భారతి.

అత్తాకోడళ్ళ మధ్య భేదాభిప్రాయాలున్నా... భారతి ఎంతలా సర్దుకుపోతున్నా... 'ఈ బ్రతుకు అందంగా లేదు' అనే అసంతృప్తి ఆమెలో పేరుకుపోయింది. ఇప్పుడు అది క్షణంలో ఎగిరిపోయింది.

తన కోడలు తన బిడ్డను గురించి తనతో స్వంతమనిషిలా మాట్లాడింది... అదే చాలు! ఆమె ఉప్పొంగిపోయింది. కొత్తజీవితం పునఃప్రారంభమయినట్టు అనిపించిదామెకు.

కానీ- 'నా కొడుకు, నా కోడలు, నా మనవడు' అని ఆనందపడ్డన్ని రోజులు పట్టలేదు... ఆమె భ్రాంతి తొలగిపోవటానికి!

పురిటి ఫంక్షన్ ఎప్పుడో... ఎవరో చెప్తే తప్ప తనకు తెలీలేదు.

పేరు పెట్టేసిన పది రోజులకు గానీ- తనకు వాడి పేరు 'కార్తీక్' అని తెలీలేదు.

'పురుడు ఎప్పుడు పెట్టుకుందాం అత్తమ్మా?' అనీ, 'ఈ పేరు నానీకి ఎలా ఉంటుంది అత్తమ్మా?' అనీ అడగటానికి సౌమ్యకు అయ్యే ఖర్చు... 'నోటి మాట' తాలూకు కొన్ని కేలరీస్... అంతే!

'ఈ కాలం కూతుళ్ళ, కోడళ్ళ మనస్తత్వాలు తనకు తెలియనివి కావు. వాళ్ళ తీర్మానాన్ని త్రోసిపుచ్చే సాహసం తను చేయదు. కాకపోతే- చనువుకొద్దీ, అనుభవంకొద్దీ మొదట్లో కొన్ని సలహాలిచ్చేది. అదీ... వాళ్ళు బాగుపడడానికే గానీ, తన మాట నెగ్గాలనే ఆధిక్యతా భావంతో కాదు. ఆ సంగతి తెలిసిన తన కోడలు, కొడుకు ఇలా ఎందుకు చేశారు?' అని బాధపడి పూరుకుంది.

కానీ, నానీ గురించి 'బాబు ఎవరి పోలిక అత్తమ్మా?' అని అడిగి, తనకు కోడలు కొండంత ఆనందాన్నిచ్చిన సందర్భం అదే తొలి, అదే తుది అవడంతో- ఇంట్లో విషయాలేమీ తనకు తెలీక, ఎవరైనా అడిగితే కలిగిన అవమాన భావాన్ని తట్టుకోలేక- అప్పుడప్పుడూ కోడలి దగ్గర మనోవేదనను బయటపెడితే... తనని తాను సమర్థించుకోవటానికి కోడలు ఏదో చెప్పేది.

ఆ సమర్థన చాలా అసహజంగా, అసమంజసంగా అనిపించేది. ఆ రోజుల్లా కోడలితో ముభావంగా ఉండేది.

ఆ తర్వాత 'ఈ అమ్మాయి తన కోడలు, ఆమెతో తనిలా ముభావంగా వుండడం ఆ అమ్మాయిని బాధించొచ్చు. ఆ పసిపిల్లలో ఒంటరి భావాన్ని కలిగించకూడదు' అనుకుని ఆమే మరలా పలుకరించేది.

రానురాను ఆమెకు అర్థమయింది... తన ముభావం కోడలిని ఏమీ బాధించడంలేదనీ, తన పశ్చాత్తాపం, తన రాజీ ధోరణి ఆమెను కరిగించడం లేదనీ! అప్పుడే ఆమె నిర్ణయించు కుంది- ఇక అంటీముట్టనట్టు వుంటే సరిపోతుందని!

కానీ, ఆ నిర్ణయానికీ ఆమె మనసు సహకరించలేదు.

ఇంట్లో మనుషులంతా స్నేహంగా ఉంటేనే అది ఇల్లవుతుంది. అలా కానప్పుడు అందరికీ అశాంతే! ఆ అశాంతిని భరించలేని ఆమె మరలా రాజీపడిపోయింది. కోడలి దగ్గరనుండి ఎటువంటి సహాయాన్నీ, స్నేహభావాన్నీ, ప్రేమనీ ఆశించకుండా బ్రతికేయడం నేర్చుకుంది.

అంతవరకు బాగానే వుంది కానీ- 'నానీ' విషయంలో తనకెలాంటి సంబంధం లేనట్టు- కోడలు మెల్లమెల్లగా వాడ్ని తన నుండి 'దూరం' చేయడంతో... తనకు పిచ్చి పట్టిపోయింది.

ఇంటిపనులతో పాటు వాడికి స్నానం చేయించడం, వాడి కాలకృత్యాలకు అటెండ్ కావడంలో, అక్షరాలు దిద్దించడంలో, వాడిని మురిపించి తినిపించడంలో, శరీర అలసట ఉందేమో కానీ... తనకు అందే మానసిక ఆనందంలో ఆ అలసట తెలిసేది కాదు. సంపూర్ణంగా వాడు కూడా దూరమైపోయాక- స్వతంత్రించి ఆ క్షణంలోనే ఇంత సాహసానికి శ్రీకారం చుట్టింది ఆమె.

ప్రక్క రూమ్‌లో నానీ ఏడుపుకు గతించిపోయిన జ్ఞాపకాల ఘట్టం ముగిసిపోయింది.

ఏడుస్తున్న నానీ దగ్గరకు వెళ్లాలనే మనసును మరలా ఆధీనంలోకి తెచ్చుకుని, అక్కడే మిగిలిపోయింది భారతి.

●

"అమ్మా... నువ్వు చేసిన పని నాకూ నచ్చలేదమ్మా!"

ఆ పసికూన ఈ ఇంటికొచ్చిన ఈ రెండు రోజులూ ఓర్చుకున్న అతను- ఇక ఓర్చుకోలేకపోయాడు.

ఇది ఎదురుచూడని ప్రశ్న కాదు భారతికి.

"నీకూ, సౌమ్యకూ నచ్చదని నాకు తెలుసురా సంజయ్! కానీ, ఏం చేయను చెప్పు? మీ కోరికలు, ఆశలు డబ్బు చుట్టూ తిరుగుతున్నాయి. నా మనసు ఓ పసిబిడ్డ కోసం అల్లాడుతోంది."

"పసిబిడ్డ ఇంట్లో ఉన్నాడు కదమ్మా!" అతనికి తల్లితో ఇలా మాట్లాడాల్సిరావడం కాస్త ఇబ్బందిగానే వుంది.

"అదే... అదే సంజయ్... అదే చెప్పబోతున్నాను. నీకు పుట్టే బిడ్డ నాకు కావాలని, నా మనసు ఇరవైయ్యేళ్లు ఎదురుచూసి, ఎదురుచూసి ఎదురుదెబ్బ తిన్నది. నా మనవడు నా బిడ్డ కాలేదని నా కోడలు నాకు పాఠాలు నేర్పించింది. అందుకేరా... ఈ బిడ్డను నా బిడ్డగా తెచ్చుకోవాల్సివచ్చింది!" ఆమె 'తల్లి మనసు' ఈ క్షణంలో ఓ బండరాయి.

"అమ్మా..."

"ఆగాగు... భయపడకు. నీ ఆస్తిలో వాడికి వాటా అడగను. నాలో ఇంకా శక్తి మిగిలుంది. టీచర్‌గా రిటైర్ అయిన డబ్బుని వాడి పేర బ్యాంకులో వేస్తాను. ట్యూషన్స్ చెప్పి వాడిని పెంచుకుంటాను..."

– ఆమె ఎంత నిగ్రహించుకున్నా ఆమె కంఠంలో తేడా, ఆమె కనుకొలకుల్లో ఆమె గుండె రోదన ఫలితంగా ద్రవించిన కన్నీటిబొట్టు... ఈ రెండూ సంజయ్ మనసును తాకాయి.

"అమ్మా..." తల్లి ప్రక్కనే కూర్చుంటూ అడిగాడు అతను–

"ఏమైందమ్మా..? నాకు చెప్పవా?"

కరిగిపోయింది భారతి.

"ఏమీ లేదు నాయనా... ఏమీ లేదు..." ఇప్పుడు ఆమెకు కోడలి మీద నేరాలు చెప్పి బిడ్డను బాధపెట్టాలన్పించలేదు.

"అమ్మా... నువ్వు నన్ను పరాయివాడ్ని చేస్తున్నావు! నేను నీ కొడుకునమ్మా..."

భారతి నిగ్రహం సడలిపోయింది. కొడుకు తాలూకు బాధకు, ఆ ప్రేమ భావానికి సున్నితమైన ఆమె కన్నీటికుండ పగిలిపోయింది.

"అమ్మా ఏమిటమ్మా? ఏం జరిగిందమ్మా? నావల్లేమైనా తప్పు జరిగిందా? ఎందుకిలా బాధపడుతున్నావు? చెప్పవా..?"

అంతే... ఆమె వేదనంతా పటాపంచలైపోయింది.

తను ఎదగాలనే ప్రయత్నంలో ఘనీభవించిన తల్లి పట్ల అతని ప్రేమ ద్రవించగానే... ఆమె గుండె చల్లబడిపోయింది... ఆమె సర్వం మరచిపోయింది.

"ఏం లేదు... నీ తప్పేం లేదులే! లేచి స్నానం చెయ్యి... ఆఫీసు కెళ్లాలి కదా!"

"పర్వాలేదు. ఆలస్యంగా వెళ్తాను. నీ బాధేంటో నాకు చెప్పమ్మా..."

ఇప్పుడామెకు కొడుకుని గానీ, కోడల్ని గానీ ఏదీ అడగాలని లేదు. ఈ క్షణాలు శాశ్వతమైతే చాలని ఉంది.

"సరేలే అమ్మా... నీకు చెప్పాలనిపించినపుడు చెబుదువు గానీ! ఇప్పుడు నీ మనసు బావుందా? నేను ఆఫీసు కెళ్లనా? లీవ్ పెట్టేయనా పోనీ..?"

"వద్దు... వద్దు... వెళ్లు!" తృప్తిగా అంది భారతి.

ఆమెకు కొడుకు తన దగ్గరే ఉండాలని లేదు. అతని ప్రేమ తనకూ కాస్త కావాలనే కోరిక మాత్రం ఇంకా పచ్చిగా, పచ్చగా వుంది. ఆ విషయం ఆమె కొడుక్కి చాలాసార్లు చెప్పింది. మరోసారి చెప్పడం ఎందుకు?

సంజయ్‌కి తల్లిని బాధపెట్టాలనేం లేదు... అది రక్తబంధం! కాకపోతే- అతను తల్లిని నిర్లక్ష్యం చేస్తున్న సంగతి అతను గ్రహించడం లేదు. తన తల్లి మంచిచెడ్డలు తన భార్యకు వదిలేసి, వాళ్ళిద్దరి కోసం శ్రమపడుతున్నాడు.

●

"ఏమిటండీ... ఈ శని? ఇంకా మీ అమ్మ వాడిని తిరిగి ఇచ్చేయలేదు!"

భార్యకు జవాబు చెప్పలేదు సంజయ్.

తీక్షణంగా చూశాడు...

"అమ్మ ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకుంది? నువ్వేమైనా అన్నావా?"

"నేనే మంటాను? మరీ మురిపెం చేసి నానీని చెడిపేస్తుంటే... కాస్త కోప్పడ్డాను."

"అంతేనా? ఇంకేమీ చేయలేదా? అంతమాత్రానికే ఇంత పెద్ద నిర్ణయం తీసుకునేంత ఆవేశపరురాలు కాదు అమ్మ. మనవణ్ణి చెడిపేసుకునేంత తెలివితక్కువదీ కాదు. నన్నూ ఆమే పెంచింది..!"

భర్త గొంతులోని తీవ్రతకు భయపడింది సౌమ్య.

'అన్నీ చెప్పేసుంటుంది అత్త!' అని మనసులోనే అనుకుని- "వాడు మరీ ఆమెకు చేరువైపోతూ, నాకు దూరమైపోతుంటే... ఒక్క మాటన్నాను."

"ఏమన్నావ్?"

తల వంచుకుంది సౌమ్య.

"వాడు నా కొడుకు... వాడి ఆలనా పాలనా నేను చూసుకుంటాను!' అని అన్నాను. అదీ తప్పేనా? ఆ మాత్రం మా అత్తను నేను అనకూడదా? మా అమ్మనైతే అననా?" ముక్కు చీదేసింది సౌమ్య.

సంజయ్‌కు ఇప్పుడే మెలకువ వచ్చినట్టయింది...

ఈ తప్పు తన తల్లిదీ కాదు, తన భార్యదీ కాదు. ఈ ఇంట్లో జరిగే గొడవలు తను పట్టించుకోలేదు. అవే సద్దుమణుగుతాయనుకున్నాడు. ఎప్పుడైనా భార్య గానీ, తల్లి గానీ ఒకరి మీద ఒకరు తమ బాధను తన దగ్గర వ్యక్తం చేస్తే... ఎవరిని వాళ్ళ దగ్గర సమర్థించి తను గొప్పగా గొడవల్ని తగ్గించా ననుకున్నాడు.

- అలా తాత్కాలికంగా ఎస్కేప్ అయినందుకు సంతోషించాడే గానీ... తన భార్య తన తల్లి మనసును ఇంతగా బాధపెడ్తోందనుకోలేదు. నానీ విషయంలో తన తల్లి ఆరాటాన్ని తను అర్థంచేసుకోకపోలేదు. కానీ, నిర్లక్ష్యం చేశాడు ఆమెని.

"ఏమిటీ... మాట్లాడరూ?"

"చూడు సౌమ్యా! అమ్మకు అలాగే నచ్చజెప్తాను. కానీ, నువ్వు కూడా ఓ ఇరవై ఏళ్ల ముందుకెళ్లి ఆలోచించు. నీకూ మనవడు పుడితే, వాడిని నీ కోడలు నీకివ్వకుండా తనకే హక్కుల్ని ధారాదత్తం చేసుకుంటే... నీకు బాధేయదూ!? ఆలోచించు..!"

"ఆమెను ఇంకేమీ అనను... సారీ!" గట్టిగా ఊపిరి పీల్చుకుంది సౌమ్య.

అంతటితో ఆ సమస్య పరిష్కారం అయినట్టే అనిపించిదామెకు.

●

"అమ్మా! నేను, సౌమ్యతో మాట్లాడాను. నానీ మీద సర్వహక్కులూ నువ్వే తీసుకో! ఆ బిడ్డను తిరిగి ఇచ్చేయ్... ప్లీజ్ అమ్మా! నా మాట కాదనకు."

బిడ్డకు స్నానం చేయిస్తున్న ఆమె తలెత్తింది.

"సంజూ! ఈ హామీ నువ్వు కాస్త ముందుగా ఇచ్చుంటే... ఈ అనర్థం జరిగి ఉండేది కాదు. నేను చేసింది తప్పో, ఒప్పో నాకు తెలీదు. తప్పే అయితే... అది తిరిగి సవరించుకోలేని తప్పు చేశానురా!"

"ఎందుకనమ్మా? వాడిని నేను మంచివాళ్ళకు, పిల్లల్లేని సంపన్నులకే ఇస్తాను... నువ్వు బాధపడకు. ఈ వయసులో బాధ్యత లెందుకు చెప్పు? నీకెంత డబ్బు కావాలన్నా ఇస్తాను. హాయిగా ఎంజాయ్ చేసుకో..."

నిట్టూర్చిందామె. ఈ వయసులో తనకు డబ్బెందుకు?

"నా బాధ అదికాదురా సంజూ! ఆ బిడ్డ... ఆ బిడ్డ స్వయానా... నీ రక్తం!"

అది వినగానే- సంజయ్ మేధస్సు మొద్దకట్టుకుపోయింది.

నివ్వెరపడి నిల్చుండిపోయాడు.

ఇదెలా సంభవం? అమ్మకు మతిగానీ పోలేదు కదా?!

"ఏం మాట్లాడుతున్నావు నువ్వు? నాకు అర్థంకావడం లేదు!"

భారతికి నిస్సత్తువ వచ్చేసింది. తాను చేసిన ఈ పని తన కొడుకును ఎంతగా బాధిస్తుందో! ఎంతగా వాడి మనసును నొప్పిస్తుందో!! ఆ ఆలోచనకే ఆమెలో శక్తి హఠాత్తుగా సన్నగిల్లినట్లయింది.

"నువ్వు వెళ్ళి నీ రూమ్‌లో కూర్చోమ్మా సంజూ! నేను వచ్చి మాట్లాడుతాను..."

బిడ్డకు పూర్తిగా స్నానం చేయించకుండానే టవల్‌తో తుడిచి, వాడిని చంక నేసుకుని, కొడుకు గదిలో కొచ్చింది భారతి.

ఆమె అదృష్టం... అక్కడ కోడలు లేదు. ఆమెకు తను జరిపిన ఈ బృహత్కార్యాన్ని తన కొడుకు ముందు పరచందే మనసు కుదుటపడేలా లేదు.

"కూర్చోమ్మా..."

ఆమె కూర్చుంది.

కానీ, ఒక్క సంవత్సరం పాటు సాహసం చేసి తను తన మనసులోని కోరికను తీర్చుకోగలిగింది కానీ, ఆ జరిగిందాన్ని బిడ్డకు చెప్పడానికి ఆమెకు సాహసం చాలడం లేదు.

"చెప్పమ్మా..." తల్లి చెయ్యి మీద తన చెయ్యి వేసి అడిగాడు సంజయ్.

●

"సంజూ! మీ తాతయ్య, అమ్మమ్మ... ఏవో కొంపలు మునిగినట్టు నాకు పదహారేళ్లకే పెళ్ళి చేసేశారు... నా పద్దెనిమిదవ ఏటనే నువ్వు భూమిమీద పడ్డావు.

నీకు పెళ్ళవడం, నానీ పుట్టడం, అన్నీ... నాకు ఐదు పదులు దాటకముందే జరిగిపోయాయి. నాలో ఆశలు, కలలు ఇంకా అణిగిపోకముందే పోయిన ఆయన ఎలానూ పోయారు. మిగిలిన నువ్వు ఆఫీసు నుండి ఎప్పుడు వస్తావో తెలీదు. వచ్చినా... వెంటనే రూమ్‌లో దూరేస్తావు. నువ్వు హాల్లో కొచ్చినప్పుడు నీతో పది నిమిషాలు మాట్లాడుకుందామనే నా కోరికను నీ కొస్తున్న టెలిఫోన్ కాల్స్ కాటేసేవి.

నీ చిన్నప్పటి ముచ్చట్లు, అల్లరి చేష్టలు, నీతో తనివితీరా మాట్లాడుకోవాలనే తపన తీరనే లేదు. ఇటు అంటీముట్టనట్టుండే సౌమ్య- నాకేమాత్రం హక్కు, స్వతంత్రం లేనట్టు ఏదో వంకన నానీని దూరంగా తీసుకెళ్లే కోడలు- ఇంకా ఊహ తెలియని మూడేళ్ల పసిబిడ్డ- ఆ ఒంటరితనం, ఆ నిశ్శబ్దం నన్ను పిచ్చిదాన్ని చేసేసింది..."

నిశ్చేష్టుడై వింటున్నాడు సంజయ్.

"సంజూ! ఒక్కోసారి 'ఓల్డ్ ఏజ్ హోమ్'లో చేరిపోవాలనిపించేది. లేదా, ఏ పసిపిల్లల అనాథాశ్రమంలోనో, హాస్టల్‌లోనో ఆయాగానైనా జీవితం గడపాలన్పించేది. కానీ, ఎన్ని రకాల ఆలోచనలు వచ్చినా... ఆఖరుకు- నీ బిడ్డకు నాన్నమ్మగా ఈ శేషజీవితం గడిపేయాలనే మనసు ఆరాటపడేది. నువ్వు తిరిగి పసివాడిగా నా ఒడి చేరితే బావుణ్ణనే ప్రలోభం, నానీ ఆలనా పాలనతో సర్వం మర్చిపోవాలనే గాఢమైన దురాశ... ఏదీ తీరవని తెలిసి... ఈ నిర్ణయానికొచ్చాను.

నేను నా విరక్తిలో... నా మనసును నిగ్రహించుకోలేక, తప్పు చేశానురా! ఇప్పుడు ఆలోచిస్తే తాగుబోతువాడికీ, నాకూ తేడా కన్పించడం లేదు!" ఆమె కంఠం రుద్ధమయి ఆగిపోయింది.

సంజయ్ భయపడ్డాడు.

'అమ్మ ఈ బిడ్డను దొంగతనం చేసి తీసుకుని రాలేదు కదా?! ఊహుఁ... కాదు. మరి? అమ్మ 'తన రక్తం' అంటుందేమిటి? తనకు తెలీకుండా అమ్మకు మరో సంతానం తాలూకు బిడ్డ కాదు కదా ఇది?!'

- అలా ఆలోచించడానికి అతని సంస్కారం ఒప్పుకోలేదు.

కొడుకు ముఖంలో దీనత్వానికి, భయాందోళనకు చలించిపోయిందామె.

"నాయనా! చెప్పానుగా... నిగ్రహం కోల్పోయానని! కోడల్ని బ్రతిమలాడుకుని అలసిపోయాక- నానీ కూడా నాకు దూరంగా మసలడంతో... వివేకం కోల్పోయి, డాక్టర్ కౌసల్యను కలిశాను. ఆమె మొదట కాదంది. నాకు చాలా నచ్చజెప్పడానికి ప్రయత్నించింది. ఆ తర్వాత నా ఆరాటాన్ని అర్థంచేసుకుని నన్ను ఆత్మహత్యా ప్రయత్నం నుండి తప్పించడానికి ఒప్పుకుంది."

"అమ్మా! నువ్వు... ఆత్మహత్యా?! ఎప్పుడు? ఏమిటమ్మా... ఇది??"

"సారీ సంజూ! ఒక్కసారి కాదు... కొన్ని వందలసార్లు చేసుకోవాలనుకున్నాను. ఆత్మహత్యా సదృశమైన ఈ ఒంటరి జీవితం కంటే- శాశ్వత నిద్రను వాంఛించాను. ఒకటి రెండుసార్లు ప్రయత్నించి ఓడిపోయాను."

"అమ్మా..." అతని కంట్లో నీరు.

"అవును నాయనా... నాకా రోజుల్లో అలానే అన్పించేది. ఏమిటో మీరంతా నాకుండగా..."

సంజయ్‌కు తల్లి పూర్తిగా అర్థమయింది...

తన తప్పు పూర్తిగా స్పష్టమయింది.

ఒక్క... ఒకే ఒక్క సానుభూతి మాట, ఒకింత ప్రేమ, కాస్తంత భరోసా తన నుండి ఈరోజు అందుకున్న అమ్మ పశ్చాత్తాపపడడానికి కారణం...

తన నిర్లక్ష్యం కాదా?

- అతను తనను తాను శపించుకున్నాడు.

కొడుకు మౌనం భారతిని పరిపరి విధాల ఆలోచించేలా చేసింది. కొడుకు బాధపడకుండా తనిప్పుడేం చేయాలో ఆలోచిస్తోంది.

అతను తన నిట్టూర్పును తనలోనే విలీనం చేసుకుని అడిగాడు-

"జరిగింది జరిగినట్టు చెప్పేయమ్మా... టెన్షన్‌గా ఉంది!"

ద్రవించిపోయింది భారతి.

"చెప్తాను నాయనా! నా ఫ్రెండ్ డాక్టర్ కౌసల్య కజిన్ డాక్టర్ మాలతి ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్ పెట్టింది. కౌసల్య ఆమెను ఫోర్స్ చేసి నాకీ సమాయం చేసింది. ఇది లీగల్ కాదట... క్రైమ్ అట! సంజూ... ఈ విషయం సౌమ్యకు చెప్పకురా! చెప్పాక పరిణామాలు ఎలా ఉంటాయో..?!" ఆగి, కొడుకు వంక చూసిందామె.

"చెప్పనులే... నువ్వు చెప్పు!"

- అని లేచి తలుపు గడియ పెట్టి వచ్చాడతను.

"నువ్వు టూర్‌కి వెళ్లమని నాకు నెలరోజులకు డబ్బిచ్చావు... గుర్తుందా? అదీ... నా దగ్గర రిటైర్ అయిన డబ్బుంది కదా- అదీ కలిపి, టూర్ కెళ్లకుండా 'ఇన్‌ఫెర్టిలిటీ' సెంటర్ కెళ్లి ఆమెను ప్రాధేయపడ్డాను. అప్పుడే ఒక పేద తల్లి- తన శిశువుని ఛిద్రం చేసుకోవడానికి అబార్షన్ కోసం వచ్చింది. నా అదృష్టమూ, ఆ పిల్ల అదృష్టమూ కలిసివచ్చి ఆమె గర్భవతి కాదని తేలింది. క్షణంలో ఆ డాక్టర్ ఎంత తెలివిగా ఆలోచించిందో... ఆమెను అడిగేశారు..."

"ఏమనీ..?"

"నీకు లక్ష రూపాయ లిప్పిస్తాను... ఓ బిడ్డను కని, ఈమె కిస్తావా? వైద్యం ఖర్చులు, నీ ఆహారం ఖర్చులు, అన్నీ ఆమే ఇస్తారు...' అని. ఆ పిల్ల వెంటనే తలూపేసింది. లక్ష రూపాయల ఫిగర్ ఆమె ఊహించనిది!"

ఆశ్చర్యంగా వింటున్నాడు సంజయ్.

"అయితే, ఆ గర్భం నీ భర్తతో వచ్చేది కాదు. ఇంజెక్షన్ ద్వారా తెప్పిస్తాము' అన్నారు డాక్టర్ మాలతి. ఆమె అందుకు ఒప్పుకోలేదు. ఇంజెక్షన్, ఆపరేషన్ అంటే భయపడే పరిస్థితుల్లో పెరిగిన పిల్ల ఆమె!"

నిశ్శబ్దంగా వింటున్నాడు సంజయ్.

"ఇంజెక్షన్' అంటే ఏమిటని అడగవేం... సంజూ?"

"నువ్వే చెప్తావు కదా అమ్మా!"

'తన బిడ్డ ఎంత సాధువు! తనెంత బాధిస్తోంది వాడిని! మాతృత్వానికే మచ్చ తను!' నిట్టూర్పు విడిచి, తిరిగి చెప్పడం ప్రారంభించిందామె-

"తర్వాత ఆమె భర్తను, అత్తగారిని పిలిపించి, వాళ్ళ దగ్గర సమ్మతిస్తున్నట్టు సంతకం తీసుకుని, వాళ్ళకు అడ్వాన్స్ యాభై వేలిచ్చి- నెల తర్వాత వస్తానని చెప్పి, తిరిగివచ్చి నీకు టూర్ నుంచి వచ్చానని అబద్ధం చెప్పాను."

తల వంచుకుందామె.

"నీకు గుర్తుందా సంజూ... సంక్రాంతి రోజు సౌమ్యకు చీర కొనిచ్చి, 'నీకేం కావాలమ్మా!' అని అడిగావు నువ్వు. అప్పుడు నా మనసులో మాట నీకు చెప్పుకున్నాను. నాకు మరో మనవడో, మనవరాలో కావాలని."

'పుడ్తారు లేమ్మా! ఇప్పుడు నీకేం కావాలో అడుగు...' అని తోసేశావు నువ్వు. నేను ఒప్పుకోలేదు. అసలు పుట్టే ఆశ ఉందో, లేదో తెలిపోతే... నిశ్చింతగా ఉంటాననీ, నీ వీర్యకణ పరీక్ష ఇప్పుడు చేయించి తేల్చిచెప్పమని అడిగాను... గుర్తుందా?"

గుర్తొచ్చింది సంజయ్‌కు.

'అలాగే... రిపోర్టు తెచ్చి నీ చేతిలో పెడ్తాను...' అని తనంటే... అమ్మ ఒప్పుకోలేదు. తను చెప్పిన చోటకే రావాలని పట్టుబట్టింది... ఇందుకా? అంటే... తన జీవకణాల్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి, తన వంశాంకురాన్ని మరో 'అనామిక' గర్భంలో పెంచి... ఇంత ధైర్యం చేసిందా అమ్మ?!

ఇంత 'రిస్క్' తీసుకోవాల్సినంత కోరిక ఆమెలో కలిగిన సంగతి తనకు తెలీలేదంటే... దానికి కారణం... ఆమెనా, తనా?'

- ఆలోచిస్తున్నాడు అతను.

తప్పు చేశాననే భావంతో గిల్టీగా ఫీల్ అవుతోంది భారతి.

"బాబూ! నేను తప్పే చేశానో, ఒప్పే చేశానో... నాకు తెలీడం లేదురా! తప్పనుకుంటే నువ్వు నాకు ఏ శిక్ష విధించినా సిద్ధంగా వున్నాను... ఒక్క వాడిని అనాథను చేయమని చెప్పడం తప్పు! ఎందుకంటే... వాడు నేను తయారుచేసుకున్న బొమ్మ కాదు. నా బిడ్డ జీవకణంతో సైన్స్ తయారుచేసిచ్చిన అన్ని రకాల మానసిక, శారీరక స్పందనలున్న... మనలాంటి జీవి!"

ఆమె చెప్పడం పూర్తిచేయకముందే అతను అందుకున్నాడు-

"అదలా వదిలెయ్ అమ్మా! మరి, ఆ తల్లికి కూడా ఈ బిడ్డ మీద హక్కు ఉంటుంది కదా! తీరా నువ్వు వాడి మీద మరులు పెంచుకున్నాక- ఆమె వచ్చి ఆ బిడ్డను అడిగితే..?"

"ఊహుఁ... నేను ఇక్కడ మాత్రం చాలా తెలివిగానే వ్యవహరించాను. మన అడ్రసు ఆమెకు ఎట్టి పరిస్థితుల్లోనూ తెలిసే అవకాశం లేదు. పైగా- ఆమె తన భర్త ద్వారా వచ్చే గర్భమే వద్దనుకుంది. అలాంటిది- ఈ బిడ్డ కోసం రాదు. ఆ భయం నీకు వద్దు!"

తాను చెప్పాల్సింది చెప్పేసి, బిడ్డ తీర్పు కొరకు ఎదురుచూస్తూ కూర్చుంది భారతి.

"అమ్మా! ఇది చిన్న విషయం కాదు... నీ కోడలికి చెప్పకుండా..."

హతాశురాలైందామె. కొద్దిగా హర్ట్ అయ్యింది కూడా!

మలినమైన తల్లి ముఖం చూడగానే- తన తప్పు తాను తెలుసుకున్నాడు సంజయ్.

ఎంత తల్లి అయినా, భార్య అయినా... వాళ్ళిద్దరూ తన వాళ్ళే! అయినా ఓ కొడుగ్గా, ఓ భర్తగా అతను కొన్ని విషయాల్ని గుప్తంగానే ఉంచి, ప్రాబ్లమ్స్‌ని వాళ్ళ గుప్త సమ్మతితో తానే పరిష్కరించాలి.

ఆ చిన్న సత్యం తెలీని సంజయ్- ఇలా అప్పుడప్పుడూ చిక్కుల్లో పడుతున్నాడు.

"సారీ అమ్మా! నా ఉద్దేశ్యం... భార్య పర్మిషన్ తీసుకోవాలని కాదు. నువ్వు తనకి చెప్పొద్దన్నావు కదా... చెప్పకుండా ఎలా అనే..!?"

తల్లి మనసు కరిగిపోయింది. పాపం... సంజయ్! తన మధ్య, కోడలి మధ్య నలిగి పోతున్నాడు. ఇకనుండి తనైనా వాడిని ఇలా హింసించకూడదు. జరిగిపోయిన రోజులు ఎలానూ వాడికి చేదు స్మృతుల్ని మిగిల్చాయి.

మనసులోనే ఓ నిర్ణయం తీసుకున్న భారతి అంది-

"సంజూ! నాకు సౌమ్య పరాయిది కాదు. నిజం ఒప్పుకోవాలంటే... నాకు ఆ అమ్మాయి అంటే చాలా ప్రేమ! కానీ, ఎందుకో నాకే తెలీదు... దాన్ని ప్రదర్శించలేకపోతున్నాను. సరే... అలాగే చెప్పు! ఎలా జరగాల్సివుంటే అలా జరుగుతుంది."

నిస్త్రాణంగా కూలబడిపోయింది భారతి.

సంజయ్ ఆ పసిగుడ్డు వైపు నిశితంగా చూశాడు. ఆ బిడ్డలో తన పోలికలు స్పష్టంగా కనిపించాయి.

ఇక్కడ సైన్స్‌ని మెచ్చుకోవాలా? తప్పు పట్టాలా?

అర్థంకాలేదతనికి. ఓ పసికూనకు నానమ్మ కాలేని, ఓ ఒంటరి ఆడదానికి ఓ బిడ్డను తయారుచేసిచ్చి, కోడళ్ళకు తన బిడ్డ మీద హక్కు- తనకూ, తన భర్తకే కాక తమని కన్నవాళ్ళకూ ఉంటాయనీ... లేదా వాటిని తీర్చుకునే దారి వాళ్ళకు ఉందని బుద్ధి చెప్పిందా సైన్స్?

ఆ బిడ్డ గురించి తెలుసుకున్నాక చిత్రంగా అతనిలో రిలీఫ్!

"అయితే అమ్మా! ఆ నెలరోజులు ఎక్కడ వున్నావు నువ్వు?"

"కౌసల్య ఇంట్లో..."

"మరి, అమ్మా! ఆ ప్రయోగం మొదటిసారి ఫెయిల్ అయ్యుంటే..?"

"బావుండేది..." అని నిట్టూర్చిందామె.

మరోసారి పశ్చాత్తాపపడ్డాడు సంజయ్.

ఇంతగా ప్రేమకు లొంగిపోయే అమ్మను నిర్లక్ష్యం చేసి, ఒంటరితనపు ఎడారిలో ఆవేశపు పెనుగాలుల మధ్యకు అమెను విసిరేసి, ఎంత పెద్ద పొరపాటు చేశాడు తను?!

"నా దురదృష్టం... మొదటిసారికే ఆ ప్రయోగం సక్సెస్ అయ్యింది! అలా కాకపోయివుంటే మరోసారి ట్రై చేసేదాన్ని కాదు సంజూ! ఎందుకంటే... ఈ బిడ్డ కడుపులో పడకముందే నా ఆవేశం చల్లారిపోయింది."

తల్లుల ఆవేశాలు ఇలా ప్రేమజల్లుల్లో తడిసి, చల్లారిపోబట్టే... పిల్లల ఆటలు ఇలా సాగుతున్నాయి.

●

**'ప్రియదత్త' వారపత్రిక ... 10 నవంబర్' 2003 సంచికలో ప్రచురితమైన కథ**